

గొల్లుమంటోంది..!

ఆక్రమణలతో గొల్లలేరు డ్రెయిన్ నామరూపాలు లేకుండా పోతోంది. ఫలితంగా నీరు పారడం కష్టంగా మారింది. కొందరు డ్రెయిన్‌తోపాటు రక్షణ కోసం నిర్మించిన మట్టికట్టలను తవ్వి ఆక్రమించుకొని పలు రకాల పంటలను సాగు చేస్తున్నారు. పాలేరు, గొల్లలేరు, తిమ్మరాజు చెరువులను అనుసంధానిస్తూ 2010లో 4.148 టీఎంసీల నీటి సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మించారు. పూర్తి స్థాయిలో రిజర్వాయర్‌ను నింపినపుడు ప్రమాదమనిపిస్తే స్పిల్‌వే ఆరు గేట్ల ద్వారా 20 వేల క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతారు. ఈ నీటి వల్ల లోతట్టు గ్రామాలు, పొలాలు ముంపునకు గురికాకుండా గొల్లలేరు డ్రెయిన్‌ను నిర్మించారు. అయితే కొంతమంది ఈ డ్రెయిన్ రూపురేఖలు లేకుండా ధ్వంసం చేసి ఆక్రమించుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మేల్కొనకపోతే బుడమేరు తరహాలో దాదాపు 55 గ్రామాలకుపైగా విపత్తు బారిన పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




భూకబ్జాదారులు ధ్వంసం చేసిన మట్టికట్టలు

- ఆక్రమణకు గురవుతున్న గొల్లలేరు డ్రెయిన్
- లోతట్టు ప్రాంతాలకు పొంచి ఉన్న ముప్పు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆందోళనలో 55 గ్రామాల ప్రజలు

అవుకు, అక్టోబరు 10: గొల్లలేరు డ్రెయిన్ నిర్మాణానికి అవుకు, శివవరం, నిచ్చెనమెట్ల, అన్నవరం, చెన్నంపల్లె, చిన్నకొట్టాల గ్రామాల రైతుల నుంచి 370 ఎకరాలు భూమిని సేకరించారు. దీని వెడల్పు 70 మీటర్లు. డ్రెయిన్ రక్షణ కోసం రెండు వైపులా కలిపి 80 మీటర్ల వెడల్పుతో 25 అడుగుల ఎత్తుతో మట్టికట్టలను నిర్మించారు. స్పిల్‌వే గేట్ల నుంచి శివవరం గ్రామం వరకు 15.6 కి.మీ. పొడవునా నిర్మితమైన డ్రెయిన్ నిర్మాణానికి రూ.14.75 కోట్లు ఖర్చు చేశారు. రిజర్వాయర్‌కు ప్రమాదం ఏర్పడినా లోతట్టు గ్రామాల తాగు, సాగు నీటి అవసరాల కోసం 20 వేల క్యూసెక్కుల నీటిని తరలించుకునే విధంగా డ్రెయిన్ నిర్మించారు. కొంత కాలానికి రిజర్వాయర్ నుంచి కడప జిల్లాకు కృష్ణా జలాలను తరలించేందుకు చెర్లోపల్లె సమీపంలో జీఎన్ఎస్ఎస్ హెడ్‌రెగ్యులేటర్ గేట్లను నిర్మించారు. రిజర్వాయర్‌లో 1.85 టీఎంసీలకు పైగా నీరు చేరిన వెంటనే జీఎన్ఎస్ఎస్ గేట్లను ఎత్తి కడప జిల్లాకు విడుదల చేస్తున్నారు. దీంతో రిజర్వాయర్‌కు ఉన్న స్పిల్‌వే గేట్లు 15 సంవత్సరాలుగా తెరుచుకున్న దాఖలాలు లేవు. ఇది భూకబ్జాదారులకు వరంగా మారింది. ఇదే అదనుగా భావించి గొల్లలేరు రక్షణ కోసం ఇరువైపులా ఏర్పాటు చేసిన మట్టికట్టలను ఎక్స్‌కవేటర్లతో ధ్వంసం చేసి ఆక్రమించుకొని పంటలు సాగు చేస్తున్నారు. డ్రెయిన్ నిర్మాణానికి సంబంధించిన రికార్డులు తమ కార్యాలయంలో కనిపించటం లేదని ఎస్సార్బీసీ అధికారులు చెబుతుండటం గమనార్హం.

డ్రెయిన్ కనుమరుగైతే అపార నష్టం

డ్రెయిన్ కనుమరుగైతే లోతట్టు ప్రాంతాలకు అపార నష్టం వాటిల్లుతుంది. గొల్లలేరు కింద అవుకుతోపాటు లోతట్టు గ్రామాల్లో ఎనిమిది వేల ఎకరాల్లో భూములను రైతులు సాగు చేస్తున్నారు. గతంలోనే డ్రెయిన్ ఆక్రమణకు గురవుతున్నట్లు 2018లోనే ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న బీసీ జనార్దన్‌రెడ్డి వెంటనే స్పందించి డ్రెయిన్ వెంట పర్యటించి భూకబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని అధికారులను, పోలీసులను ఆదేశించారు. ఎస్సార్బీసీ అధికారులు రెండు టీములుగా ఏర్పడి కొంత మంది భూకబ్జాదారులను గుర్తించారు. వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అప్పట్లో డ్రెయిన్ ఆక్రమణ కొంత కాలం నిలచిపోయింది. అనంతరం వైసీపీ అధికారంలోకి రావటంతో ఆక్రమణకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.



స్పిల్‌వే గేట్లు



గొల్లలేరు డ్రెయిన్‌లో సాగు చేసిన వరి పంట

మరమ్మతులకు గురైన స్పిల్‌వే గేట్లు

స్పిల్‌వే గేట్లు తెరిచే పరిస్థితి లేకపోవటంతో ఆలనా పాలనా కరువైంది. 15 ఏళ్లగా మరమ్మతులకు నోచుకోకపోవటంతో తుప్పు పట్టి ఆరు గేట్ల నుంచి నీరు లీకవుతోంది. 2022లో రూ. 2.01 కోట్లతో స్పిల్‌వే గేట్ల మరమ్మతులు చేపట్టినా వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవటంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. 2007లో రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్ చేరుకోవటంతో గొల్లలేరు డ్రెయిన్‌కు ఇరువైపులా మట్టికట్టలు ఉన్నప్పుడే స్పిల్‌వే గేట్లను ఎత్తారు. అవుకులోని లోతట్టు ప్రాంతమైన మండపం వీధి, ముస్లిం వీధుల్లోని ఇళ్లలోకి నీరు చేరి రెండు వారాల పాటు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. నీటి ప్రవాహానికి లోతట్టు గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు నీటిలో గల్లంతయ్యారు. రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీరు ఉన్నప్పుడు నీటి ఉధృతికి స్పిల్‌వే గేట్లు ప్రమాదవశాత్తు తెరుచుకుంటే లోతట్టు ప్రాంతాలు మునకకు గురయ్యే ప్రమాదం ఉంది. ఎస్సార్బీసీ ఉన్నతాధికారులు గొల్లలేరు డ్రెయిన్ ఆక్రమణపై దృష్టి సారించి పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కుందూ వరకు విస్తరించకపోవటంతో..

రిజర్వాయర్ స్పిల్‌వే గేట్ల నుంచి గొల్లలేరు డ్రెయిన్ ద్వారా వెళ్లే నీరు సంజామల మండలం అల్లూరు మీదుగా కుందూలో కలిసే విధంగా రూపకల్పన చేశారు. అయితే పలు కారణాలతో డ్రెయిన్ నిర్మాణాన్ని శివవరం వరకు మాత్రమే నిర్మించి నిలిపివేశారు. దీంతో వర్షాలతో పాలేరు వాగు ఉప్పొంగిన ప్రతిసారి గొల్లలేరు నీరు తోడవటంతో సంజామల మండలంలోని పలు గ్రామాల రైతులు సాగు చేసుకున్న పంటలు వరద ముంపునకు గురవుతున్నాయి. గత నెలలో పాలేరు వాగు పొంగటంతో వందల ఎకరాల్లో పంటలు నీట మునిగి నష్టం వాటిల్లింది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వరద ముంపునకు గురైన పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపి ఎకరాకు రూ. 10 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయటంతో కొంత ఊరట లభించింది.



డ్రెయిన్ రక్షణ కోసం నిర్మించిన మట్టికట్టలపై సాగు చేసిన మొక్కజొన్న పంట

లోతట్టు ప్రాంతాలు మునకకు గురయ్యే ప్రమాదం



గొల్లలేరు డ్రెయిన్ మట్టికట్టలను భూకబ్జాదారులు ఎక్స్‌కవేటర్లతో ధ్వంసం చేసి ఆక్రమించుకుంటున్నారు. ఎస్సార్బీసీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో డ్రెయిన్ రూపురేఖలు లేకుండా పోయాయి. ఆక్రమణలను అరికట్టకపోతే లోతట్టు ప్రాంతాలు మునకకు గురయ్యే ప్రమాదం ఉంది

-రామనాథరెడ్డి, రైతు, చెన్నంపల్లె

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



డ్రెయిన్ ఆక్రమణదారులను గుర్తించి కేసులు నమోదు చేయాలి. ప్రతి ఏటా ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. దాదాపు 225 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైంది. విపత్తు బారిన పడే అవకాశం ఉంది. డ్రెయిన్‌ను పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టాలి.

-గుడిపాటి శివ, రైతు, అవుకు

స్పిల్‌వే గేట్లకు మరమ్మతులు చేపట్టాలి



స్పిల్‌వే గేట్లు మరమ్మతులకు నోచుకోక తుప్పుపట్టి ఆరు గేట్ల నుంచి నీరు లీకవుతోంది. రిజర్వాయర్‌లో రెండు టీఎంసీల నీటి నిల్వ తగ్గకుండా ఉంటుంది. గొల్లలేరు డ్రెయిన్‌ను భూకబ్జాదారులు పూర్తిగా ధ్వంసం చేశారు ప్రమాదవశాత్తు ఏ ఒక్క గేటు తెరుచుకున్నా లోతట్టు గ్రామాలు ముంపునకు గురి కావలసి వస్తుంది. వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

-దశరథుడు, రైతు, అవుకు

డ్రెయిన్ రికార్డులు కనిపించటం లేదు

గొల్లలేరు డ్రెయిన్‌ను భూకబ్జాదారులు ఆక్రమించుకున్నారు. గతంలోనే మా అధికారులను అక్కడకు పంపి కొందరు ఆక్రమణ దారులను హెచ్చరించాం. డ్రెయిన్‌కు సంబంధించిన రికార్డులు మా కార్యాలయంలో కనిపించటం లేదు. రికార్డుల కోసం ఆర్డీవోకు లేటర్ రాశాం.

- సురేష్‌బాబు, ఎస్సార్బీసీ ఈఈ, బనగానపల్లె

రతన్ టాటా మృతికి మంత్రి బీసీ సంతాపం



బనగానపల్లె, అక్టోబరు 10: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా మృతి తనను ఎంతో కలచివేసిందని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ వ్యాపార రంగంలో అంచలంచెలుగా భారతదేశంలోనేగాక విదేశాల్లో కూడా వ్యాపారాలు అభివృద్ధి చేసి లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన మహామనిషి రతన్‌టాటా అన్నారు. వేల కోట్ల రూపాయలతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసి నూతన సంస్కరణలతో పారిశ్రామికరంగంలో రత్నంగా వెలుగొందారని కొనియాడారు. దేశ సంపదకు నిర్మాతగా వెలుగొందారని తెలిపారు. విలువలతో కూడిన వ్యాపారం చేసి పరిశ్రమలను లాభాల బాటన నడిపించిన మహా వ్యక్తి రతన్ టాటా అని కొనియాడారు.

సాగు నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధంకండి: కలెక్టర్ రాజకుమారి




వీడియోకాన్ఫరెన్స్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 10: జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలని కలెక్టర్ రాజకుమారి అన్ని మండలాల తహసీల్దారులు, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాగు నీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఈనెల 16 నుండి జిల్లాలో సాగునీటి వినియోగదారుల ఎన్నికలు ప్రారంభమై నవంబర్ 24వతేదీ వరకు జరుగుతాయని అన్నారు. ఈ నేపథ్యంలో స్థిరీకరించిన ఆయకట్టుదారుల ఓటర్ల జాబితా సిద్ధం చేసుకోవాలని మండల తహసీల్దారులను, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

14న ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ రద్దు

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 10: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాలు, మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

రతన్ టాటాకు అక్షర చిత్రాంజలి




రతన్ టాటాకు అక్షరాలతో చిత్ర నివాళి

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 10: పారిశ్రామికవేత్త రతన్‌టాటాను స్మరించుకుంటూ నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ ఎ3 డ్రాయింగ్ చార్టు మీద ఆయన జీవిత చరిత్ర తెలుగు అక్షరాలతో మైక్రో పెన్నుతో టాటాను చిత్రీకరించారు. మన దేశానికి ఎంతో పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిన వ్యక్తి అని కొనియాడారు.

దసరా పూట ధరల మోత

- కొండెక్కిన కూరగాయలు
- కాగుతున్న వంట నూనెలు
- సెంచరీ దాటిన పప్పు దినుసులు



కొలిమిగుండ్ల, అక్టోబరు 10 : పండగ పూట ధరల మోత మోగుతోంది. సామాన్యులు ఏ వస్తువూ కొనలేని పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం నూనెల దిగుమతులపై సుంకం పెంచడంతో కొద్ది రోజులుగా వంట నూనెల ధరలు సల సలా కాగుతున్నాయి. మొన్నటి వరకు 100, 120లోపు ఉన్న పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరలు పక్షం రోజుల వ్యవధిలోనే లీటరుకు రూ.20 నుంచి 30 వరకు పెరగడం వినియోగదారులకు ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఏకంగా పామాయిల్ కేజీ ధర రూ.145 ఉండగా సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.150కి చేరడం గమనార్హం. కిలో రూ.100లోపు ఉన్న కంది పప్పు గత కొంత కాలంగా రూ.170కి చేరింది. దీంతో సామాన్యులు పప్పన్నంకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇక పప్పులు కిలో రూ.120, వేరు శనగ పప్పు రూ.130 ఇలా ఏ పప్పు దినుసులు చూసినా సెంచరీ పైనే ఉన్నాయి. మరోవైపు బెల్లం రూ.65, చక్కెర రూ.44కు ఎగబాకాయి. ఇక కొబ్బెర ఏకంగా రూ.200, వెల్లుల్లి రూ.360కు చేరుకోవడంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వంటింట్లో ప్రధాన అవసరమైన కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. కిలో ఉల్లి రూ.55 ఉండగా, టమోటా రూ.100కు తగ్గడం లేదు. వంకాయ, బీరకాయ, బెండకాయ ఇలా ప్రతి కూరగాయ రూ.50కి పైమాటే పలుకుతున్నాయి. మరోవైపు పంగ పూజకు అవసరమయ్యే టెంకాయ, పూలు, పండ్లు ధరలు సైతం మండి పోతున్నాయి.

పండుగ చేసుకోలేం..



నిత్యావసర ధరలు పెరిగిన కారణంగా పండుగ చేసుకోలేని పరిస్థితి నెలకొంది. కూరగాయలు, సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి.

- బాలయ్య, కొలిమిగుండ్ల

ధరలు అదుపులోకి తేవాలి



పెరిగిన ధరలతో తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం చర్యలు తీసుకొని నిత్యావసర సరుకుల ధరలు అదుపులోకి తీసుకొస్తే సామాన్యులకు మేలు జరుగుతుంది.

- కంబగిరిస్వామి, మీర్జాపురం



105 మద్యం షాపులకు 1,627 దరఖాస్తులు



మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారి రవికుమార్

నంద్యాల క్రైం, అక్టోబరు 10 : నూతన మద్యం పాలసీలో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేస్తున్న 105 ప్రైవేట్ మద్యం షాపులకు 1,627 టెండర్ దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్ తెలిపారు. గురువారం నంద్యాలలోని ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ శుక్రవారం సాయంత్రం 7గంటలకు దరఖాస్తుల ఆహ్వానం ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. నంద్యాల ఎక్సైజ్ శాఖ పరిధిలో అత్యధికంగా 24 షాపులకు 584 మంది టెండర్ దాఖలు చేశారన్నారు. ఆళ్లగడ్డ పరిధిలో 19 షాపులకు 262 మంది, డోన్ పరిధిలో 16 షాపులకు 251 మంది, ఆత్మకూరు పరిధిలో 13 షాపులకు 164 మంది, నందికొట్కూరు పరిధిలో 10 షాపులకు 136 మంది, బనగానపల్లె పరిధిలో 12 షాపులకు 120 మంది, కోవెలకుంట్ల పరిధిలో 11 షాపులకు 110 మంది టెండర్ దాఖలు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి. రాములు, నంద్యాల సీఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో డాక్టర్

రూ.38 లక్షలు ఖాతాలోకి జమ చేయించుకున్న కేటుగాళ్లు

నంద్యాల క్రైం, అక్టోబరు 10 : నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, సర్జన్ డాక్టర్ రామయ్య సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డాడు. సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్ చేసి ఈ నెంబర్‌పై మనీలాండరింగ్, హ్యూమన్ ట్రైటింగ్, ఛీటింగ్ కేసులు ఢిల్లీ పీఎస్‌లో నమోదయ్యాయని బెదిరించారు. సీబీఐ ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తూ విచారణ చేస్తున్నామని చెప్పారు. తమ అకౌంట్‌కు రూ.39 లక్షలు పంపితే కేసుల నుంచి తప్పిస్తామని, లేకపోతే అరెస్ట్ తప్పదని బెదిరించారు. దీంతో డా. రామయ్య సైబర్ నేరగాళ్ల ఖాతాకు రూ.39 లక్షలు జమ చేశాడు. ఆ తర్వాత ఆయన టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఇస్మాయిల్ తెలిపారు. సీఐ ఇస్మాయిల్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల పట్ల అనుమానం ఉంటే వెంటనే 1930కి డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

శ్రీశైలానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో

శ్రీశైలం, అక్టోబరు 10: శ్రీశైలం జలాశయానికి గురువారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 22,801 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 8,958 క్యూసెక్కులు మొత్తం 31,759 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 27,768 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 881.60 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.8070 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 197.0114 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,241 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కులు మొత్తం 65,556 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నీరు విడుదల చేస్తున్నారు.

రాజరాజేశ్వరీదేవి అలంకరణలో వాసవీమాత


ఆత్మకూరు పట్టణంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

ఆత్మకూరు, అక్టోబరు 10: దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకుని అశ్వయుజ శుద్ధ అష్టమి అయిన గురువారం ఆత్మకూరు పట్టణంలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా తోటగేరిలో వెలిసిన చౌడేశ్వరీదేవి దుర్గాదేవిగా పూజలందుకున్నారు. ఆత్మలింగేశ్వ రాలయం, కాళికాంబదేవాలయం, అంబాభవానీ, గంగమ్మ, మార్కండేయ ఆలయం, వెంకటేశ్వర దేవాలయం, జంబులాపరమేశ్వరీ, మల్లెలమ్మ తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిషన్‌సింగ్ వీధిలో ప్రతిష్ఠించిన దుర్గాదేవీ అమ్మవారు మహిషాసురమర్దినిగా అలంకరించారు.

మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే జయసూర్య


ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

నందికొట్కూరు, అక్టోబరు 10: శ్రీశైల భ్రమరాంబికాదేవి, మల్లికార్జున స్వామి వారిని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

అమ్మవారికి బోనాలు


అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ఆత్మకూరు రూరల్, అక్టోబరు 10: మండలంలోని వెంకటాపురం గ్రామంలో వెలిసిన రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు బుధవారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రాతఃకాల సమయంలో ఆలయంలోని రాజరాజేశ్వరి మాతకు ఆలయ పురోహితులు సుందరరాజశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, దుర్గాదేవిగా ప్రత్యేక అలంకరణ గావించి, విశేష పూజలు చేపట్టారు. అంతకు ముందు గ్రామంలో మహిళలు ఉపవాస దీక్షలతో అమ్మవారికి సమర్పించడానికి బోనాలతో గ్రామంలో ఊరేగింపుగా తరలివచ్చి, అమ్మవారికి బోనాలను సమర్పించారు. అలాగే కురుకుంద గ్రామంలో వెలసిన కురుకులాంబ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరివేన గ్రామంలో అమ్మమ్మ ఆలయంలో దసరా నవరాత్రి వేడుకల్లో భాగంగా విశేష పూజలు నిర్వహించారు.

ఆలయానికి ట్రాక్టర్ విరాళం


ఈవోకు ట్రాక్టర్ తాళం చెవిని అందజేస్తున్న ఎస్‌బీఐ ప్రతినిధులు

మహానంది, అక్టోబరు 10: మహానంది క్షేత్రంలో భక్తులకు సేవలను అందించేకు గాను భారతీయ స్టేట్ బ్యాంక్ తరపున రూ.10.50 లక్షల విలువ చేసే ట్రాక్టర్‌ను గురువారం ఆ బ్యాంక్ ప్రతినిధులు అందజేశారు. గురువారం మహానంది దేవస్థానం ప్రధాన కార్యాలయంలో బ్యాంకు ప్రతినిధులు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డిని కలిశారు. అనంతరం ట్రాక్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో ఎర్రమల్ల మధు, ఇన్‌చార్జి పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌చార్జి పసుపుల సుబ్బారెడ్డి, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్, మల్లికార్జునయ్య పాల్గొన్నారు.

'సుడిదోమ నివారణకు చర్యలు తీసుకోవాలి'


బోయరేవుల గ్రామంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో

వెలుగోడు, అక్టోబరు 10: మండలంలోని మాదవరం, మోత్కూరు, బోయరేవుల గ్రామాల్లోని వరిపంటలను మండల వ్యవసాయశాఖ అధికారి పవన్ కుమార్ పరిశీలించి సుడిదోమ ఉందని, తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఏవో మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వరిపంటలో చీడపీడలు ఆశించే ప్రమాదం ఉందని, ప్రస్తుతం చాలా చోట్ల వరిపైరు చిరుపొట్టదశ నుంచి పాలు పోసుకొనే దశలో ఉన్నాయని ఈ దశలో సుడిదోమ ఆశించే అవకాశాలు ఉన్నాయని, రైతులు గమనించి రక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని సూచించారు.

నంది వాహనంపై అమ్మవారు

● మహానందిలో వైభవంగా కొనసాగుతున్న దసరా ఉత్సవాలు ● మహాగౌరిగా దర్శనమిచ్చిన కామేశ్వరీదేవి


మహానందిలో నంది వాహనంపై అమ్మవారికి ఊరేగింపు


మహానందిలో మహాగౌరిగా, కొలనుభారతిలో, ఓంకారంలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

మహానంది, అక్టోబరు 10: మహానందిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం 8వ రోజు మహాగౌరి దుర్గ అలంకారంలో కామేశ్వరీదేవిని అలంకరించి భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. అర్చకుడు ప్రకాశంశర్మ ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. రెండో ప్రాకారంలో ఏర్పాటు చేసిన యాగశాల మంటపంలో వేదపండితుడు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో ప్రత్యేక రుత్వికులు భక్తి శ్రద్ధలతో సహస్రనామార్చన, వేదపారా యణములు, కలశ పూజలు, చండీ హోమాలతో పాటు శ్రీచక్రార్చనలు, సహస్ర నామ కుంకుమార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. రాత్రి మహాగౌరి దుర్గ అలంకారంతో ఉన్న అమ్మవారిని నంది వాహనంపై ఆశీనులుజేసి ఆలయ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించరు. ఈవో శ్రీనివాసరెడ్డి, ఏఈవో మధు, ఆలయ ఇన్‌చార్జి పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్, శానిటేషన్ ఇన్‌చార్జి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొలనుభారతి సరస్వతి అమ్మవారు 8వ రోజు గురువారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో రామలింగారెడ్డి ఆదేశాల మేరకు ప్రాతఃకాల సమయంలో అమ్మవారికి ఆలయ పురోహితులు అమ్మవారికి నూతన వస్త్రాలంకరణ, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, సహస్ర నామార్చన, మహా మంగళ హారతులు నిర్వహించారు. సంగమేశ్వరంలోని ఎగువ ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో ఆలయ పురోహితుడు రఘురామశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరీ అమ్మవారు భక్తులకు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఈవో నాగప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారిని అర్చకులు దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులు దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

జిల్లాలో వర్షం


లక్ష్మాపురం సమీపంలో మొక్కజొన్న దిగుబడిపై పట్టాలను కప్పిన దృశ్యం


ఇస్కాల గ్రామ శివారులోని వాగులో ఇరుక్కుపోయిన లారీ

పాములపాడు, అక్టోబరు 10: పాములపాడులో మధ్యాహ్న సమయంలో భారీ వర్షం కురిసింది గురువారం కురిసిన భారీ వర్షానికి కేజీ రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహన దారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు ఎర్రగూడూరు, రుద్రవరం, బానుముక్కల, చెలిమిళ్ళ తదితర గ్రామాలలో కురిసిన వర్షాలకు మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆరబోసిన మొక్కజొన్న పంట తడిసి ముద్దవడంతో తీవ్రంగా నష్టపోయారు.

● ఇస్కాల గ్రామ శివారులోని భవనాశి వాగులో లారీ ఇరుక్కుపోవడంతో ఆ దారిలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం వర్షం కారణంగా వాగులో నీటి ఉధృతి కొనసాగుతోంది. దీంతో రోడ్డు వర్షంనీటి కారణంగా కనబడకపోవడంతో లారీ ఇరుక్కుపోయింది. వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఏళ్ల తరబడి కోరుతున్నా నాయకులు, అధికారులు పట్టించు కోవడం లేదని వాహనదారులు, ప్రజలు వాపోయారు.

పగిడ్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో వర్షం కురియడంతో రహదారుల పై వర్షపు నీరు ప్రవహించింది. ప్రస్తుతం గ్రామంలో మొక్కజొన్న పంటలు నూర్పిడి చేసి కల్లాల్లో అరబెట్టుకున్న సమయంలో మోస్తరు వర్షాలు కురియడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మొక్కజొన్న విత్తనాలు వర్షానికి తడవకుండా పట్టాలను కప్పి ఉంచారు.

కొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన భారీ అకాల వర్షాలకు మొక్కజొన్న ధాన్యం తడిసిముద్దయింది. ముఖ్యంగా లింగాపురం, ఎదురుపాడు, కొక్కెరంచ, గుమ్మడాపురం, ఎర్రమటం, ముసలిమడుగు తదితర గ్రామాల్లో ఓ మోస్తారు అకాల వర్షం కురిసింది. దీంతో ఇటీవలే చేతికొచ్చిన మొక్కజొన్న ధాన్యాన్ని రైతులు గ్రామ శివారులో ఆరబోస్తున్నారు. అయితే.. ఉన్న ఫలంగా భారీ వర్షం కురవడంతో ధాన్యం తడిసిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. లింగాపురం గ్రామంలో నాగరాజు అనే రైతు 12 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసి ధాన్యాన్ని ఆరబోసుకు న్నాడు. ఉన్న ఫలంగా వర్షాలు పడటంతో పంట అంతా తడిసి నీటిలో కొట్టుకుపోయింది. దీంతో ఆ రైతు కన్నీరు మున్నీరై విలపించాడు. ధాన్యం చేతికొచ్చిన సంతోషం కొద్దిసేపటికే భారీ వర్షం కురవడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయనీ రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.


లింగాపురంలో తడిసిపోయిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

బండిఆత్మకూరు: మండలంలోని భజనం గ్రామంలో చింతచెట్టులో పిడుగుపడింది. గురువారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కొద్దిపాటి వర్షం పడుతూ ఆకాశంలో ఉరుము ఉరిమి పిడుగు గ్రామంలోని చింతచెట్టుపై పడింది. ఈ సమయంలో గ్రామస్థులు ఎవరూ అక్కడ లేపోవటంతో ప్రమాదం తప్పింది.

లింగాకర్షక బుట్టలతో పురుగుల నివారణ


లింగాకర్షక బుట్టల గురించి వివరిస్తున్న ఏవో

నంద్యాల రూరల్, అక్టోబరు 10: పంట పొలాలలో లింగాక్షక బుట్టలు ఏర్పాటు చేయడం వల్ల పురుగులను నివారించుకోవచ్చునని నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని బిల్లలాపురం గ్రామంలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, పురుగుల నివారణ తదితర అంశాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు అవలంభించడం వల్ల అధిక దిగుబడి వస్తుందన్నారు. ప్రతిరైతు ఎకరాకు 6 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుని చీడపీడల ఉనికిని తెలుసుకుని గుర్తించిన పురుగులను బట్టి మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. పసుపు రంగు జిగురు అట్టలు ఎకరాకు 8- 10 వరకు అక్కడ అక్కడ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పంటలో పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల పురుగుల ఉధృతిని తగ్గించవచ్చన్నారు. వరిలో సూక్ష్మదాతు నివారణకు జింక్ సల్ఫేట్ లీటరు నీటిలో 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని కోరారు. నీటిని తొలగించి ఆరబెట్టి మరుసటిరోజు నీటిని నింపుకోవడంతో సుడిదోమ ఉధృతిని తగ్గిచుకోవచ్చునని తెలిపారు.

'ఘర్షణలకు పాల్పడితే చర్యలు'

పగిడ్యాల, అక్టోబరు 10: గ్రామాల్లో ఎవరైన ఘర్షణలకు పాల్పడి ప్రజల ప్రశాంత వాతవరణానికి భంగం కలిగిస్తే సహించేంది లేదని నందికొట్కూరు సీఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. మండలంలోని ప్రాతకోట గ్రామంలో గురువారం రాత్రి గ్రామసభ ఏర్పాటు చేశారు. అయన మాట్లాడుతూ గ్రామంలో ఏవైనా గొడవలు ఉంటే పోలీస్‌ల దృష్టికి తీసుకొనివస్తే పరిష్కరిస్తామని, అనవసరంగా గొడవలకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోకూడదని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడపకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పరిమితికి మించకుండా ప్రయాణికులను ఎక్కించుకోకూడదని ఆదేశించారు. కార్యక్రమంలో ముచ్చుమర్రి ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.

మల్యాల పంపుహౌస్ తనిఖీ

నందికొట్కూరు, అక్టోబరు 10: నందికొట్కూరు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన మల్యాల పంప్‌హౌస్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కమిషనర్ బేబి తనిఖీ చేశారు. మల్యాల పంప్‌హౌస్ వద్ద ఎన్ని మోటార్లు పని చేస్తున్నాయి? క్లోరినేషన్, వాటర్ ప్యూరిఫైయింగ్ వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా చూసుకోవాలని సిబ్బందిని వారు ఆదేశించారు. అలాగే ఏబీఎం పాలెంలో ఉన్న డ్రైనేజీ, వీధిలైట్లు, పని చేయని వాటర్ ట్యాంక్‌లను మరమ్మతులు చేయాలని కమిషనర్‌కు మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని సూచించారు. కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ చిన్నరాజు, ఏబీఎం పాలెం టీడీపీ నాయకులు నిమ్మకాయల మోహన్, కళాకర్, నిమ్మకాయల రాజు, రాజన్న, జనసేన నాయకులు పుష్పరాజ్, తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

గడివేముల, అక్టోబరు 10: మండలంలోని బూజనూరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రాము అనారోగ్యంతో మృతి చెందారు. గడివేముల సీఐటీయూ ఆటో యూనియన్ నాయకులు మృతి చెందిన ఆటో డ్రైవర్ రాము కుటుంబానికి అండగా నిలిచారు. యూనియన్ తరపు నుంచి రూ.18 వేలు నగదును రాము భార్యకు అందజేశారు. సీఐటీయూ నాయకులు సామన్న, బాలు, రాజు, నాగలక్ష్మయ్య, మాచర్ల తదితరులు ఉన్నారు.

ముగిసిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

నంద్యాల రూరల్, అక్టోబరు 10: ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత ఐదురోజులుగా నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల క్రీడామైదానంలో జరుగుతున్న 42వ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ బాల, బాలికల చాంపియన్‌షిప్ పోటీలు గురువారం ముగిశాయి. 23 రాష్ట్రాల జట్లు పోటీల్లో పాల్గొనగా బాలుర చాంపియన్‌గా మహారాష్ట్ర, బాలికల చాంపియన్‌గా తెలం గాణ జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో 2, 3 స్థానాల్లో రాజస్థాన్, ఏపీ జట్లు నిలవగా, బాలికల విభాగంలో 2, 3స్థానాల్లో పంజాబ్, మధ్యప్రదేశ్ జట్లు నిలిచాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గురురాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డా.దస్తగిరిరెడ్డి, రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణా రెడ్డి, ఏఎస్పీ యుగంధర్‌బాబు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.రవికృష్ణ, జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ సెక్రటరి మౌర్య, రాష్ట్ర సెక్రటరి నాగేంద్ర తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ట్రోఫీలు, మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

'మానసిక ఆరోగ్యంతో జీవన ప్రమాణాలు మెరుగు'

పాణ్యం, అక్టోబరు 10: మానసిక ఆరోగ్యంతో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ప్రముఖ మానసిక వైద్యురాలు ఓంకారం సింధూజ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నంద్యాలలోని నంది పైపుల ఫ్యాక్టరీలో శాంతిరాం ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం కార్మికులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు తమ వృత్తి నివాసంలో మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. మానసిక ఒత్తిడి, నిరుత్సాహం వంటి సమస్యలు ఉద్యోగులను ప్రభావితం చేస్తాయన్నారు. ఉద్యోగుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శిక్షణ, అవగాహన సదస్సులు నిర్వహించాల్సి ఉందన్నారు. ఆరోగ్యకర మైన ఉద్యోగ వాతావరణాన్ని కల్పించాలన్నారు. కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పీఆర్వో కిషోర్ బాబు, వైవి రమణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నీటికుంటల్లోకి గంబూసియా చేపలు

ఆత్మకూరు, అక్టోబరు 10: ఆత్మకూరు పట్టణంలో దోమల నియంత్రణలో భాగంగా నీటికుంటల్లో గంబూసియా చేపలను గురువారం మున్సిపల్ సిబ్బంది విడుదల చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవన్ మాట్లాడుతూ.. జిల్లా మలేరియా నిర్మూలన అధికారి కామేశ్వరరావు ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణంలోని కొత్తపేటలో గల కోనేరు, రహమతనగర్ తదితర ఏరియాల్లో నీటినిల్వలు ఉండే ప్రదేశాల్లో గంబూసియా చేపలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ చేపలు దోమల లార్వాలను ఆహారంగా తీసుకోవడం వల్ల దోమల వ్యాప్తి జరగకుండా నియంత్రించవచ్చునని తెలిపారు. సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మహానంది: పట్టణాలతో పాటు గ్రామాల్లోని మురికి కాలువల్లో గంబూషియా చేపలు వదిలితే దోమలవ్యాప్తిని అరికట్టవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. గురువారం మహానంది మండలం నందిపల్లి లోని మురికి వాగులో సిబ్బందితో కలిసి గంబూసియా చేపలను వదిలారు. జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, సహాయ మలేరియా అధికారి వరప్రసాద్‌రెడ్డి, ఎంపీహెచ్‌వో ఉసేన్‌రెడ్డి, టీడీపీ నాయకుడు మహేశ్వరరెడ్డి, చెన్నయ్య, ఆశా వర్కర్ భారతి పాల్గొన్నారు.

'నిత్యావసరాల ధరలు తగ్గించాలి'

నందికొట్కూరు, అక్టోబరు 10: నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద సీపీఎం నాయకులు గడ్డితింటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు బెస్తరాజు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణులు మాట్లాడుతూ దసరా, దీపావళి పండుగల వేళలో ధరలు పెరగడంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపై ధరాభారం మోపుతూ ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని దృష్టిలో ఉంచుకొని నిత్యావసరాల ధరలు తగ్గేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు జయరాణి, మధులత, ఉస్మాన్ బాషా, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 10: ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద ఇళ్ల నిర్మాణంలో జిల్లా దిగువ స్థానంలో ఉందని ఏఈ, డీఈలు ఉత్సాహంతో పనిచేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, ఈఈ శ్రీహరి గోపాల్ తదితరలు పాల్గొన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ గృహనిర్మాణాల ప్రగతి రోజురోజుకు తగ్గిపోతుందని రాష్ట్రంలో నంద్యాల జిల్లా 32 శాతమే ప్రగతి సాధించి దిగువ స్థానంలో ఉందని, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రోజురోజుకు పురోగతిని పెంచాలని సూచించారు. 130 ఇళ్లు పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ 99 మాత్రమే పూర్తి చేయగలిగారన్నారు. ప్రతి ఇంటి నిర్మాణానికి 90రోజుల పని దినాలలో భాగంగా ఇంకా 10,04,010 దినాలు పెండింగ్‌లో ఉన్నాయని ఏపీవోలు, ఏఈలు క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఇళ్ల నిర్మాణాలలో ఉపాధి పని దినాలను కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. గృహ నిర్మాణాలన్నీ ప్రతివారం సేజ్ కన్వర్షన్ స్థాయికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

● మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వేతనదారుల మొబిలైజేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రాజకుమారి ఏపీవో, క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి నిర్దేశించిన లేబర్ బడ్జెట్, హార్టికల్చర్, అవెన్యూ ప్లాంటేషన్ పనులు, బ్లాక్‌ప్లాంటేషన్ పనులు, ఫారంపాండ్స్, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనుల ప్రగతిలక్ష్యాలపై డ్వామా పీడీ జనార్దన్ రావు కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్ల వారీగా సమీక్షించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కొత్తపల్లి, అక్టోబరు 10: మండలంలోని కొత్తమాడుగుల గ్రామ శివారులో ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ నుంచి కింద పడి బొజ్జ రాజేశ్వరి (45) మృతి చెందారు. కొత్తపల్లి ఎస్‌ఐ కేశవ తెలిపిన వివరాలివీ.. పాములపాడు గ్రామానికి చెందిన బొజ్జ సాయిబాబా బొజ్జరాజేశ్వరి దంపతులు ద్విచక్ర వాహనంపై కొత్తపల్లి మండలంలోని బట్వారిపల్లి సరిహద్దులో ఉన్న తమ పొలానికి వెళ్తుండగా కొత్తమాడుగుల సమీపంలో మామిడితోట వద్ద బైకు అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో వెనుకాల కూర్చున్న రాజేశ్వరి తలకు బలమైన రక్తగాయాలు కావడంతో ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రాజేశ్వరి కుమారుడు బొజ్జ వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

13 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

ఆత్మకూరు, అక్టోబరు 10: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈ నెల 13, 14 తేదీల్లో మహిళల, పురుషుల విభాగాల్లో వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు వాలీబాల్ అసోషియేషన్ సెక్రటరీ, రైల్వేస్ వాలీబాల్ క్రీడాకారులు నిమ్మి కృష్ణయాదవ్, స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పీల్ మున్నా తెలిపారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. దసరా సెలవుల నేపథ్యంలో ఆత్మకూరు ప్రాంతంలో తొలిసారిగా మహిళల వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు విజయవాడకు చెందిన మూడు మహిళా జట్లు ఆహ్వాన జట్లుగా రానున్నట్లు వివరించారు. అలాగే 17ఏళ్లకు పైబడిన మహిళలు జట్లుగా ఏర్పడి పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. ఇకపోతే పురుషుల విభాగానికి సంబంధించి తాలుకా స్థాయిలో పోటీలు ఉంటాయని వెల్లడించారు. విజేతలకు బహుమతులను అందజేయను న్నట్లు వెల్లడించారు. సమావేశంలో స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు ఆసీఫ్ బేగ్, ఇంతియాజ్, ధనూష్, తైక్వాండో కోచ్ ఖాజా తదితరులు ఉన్నారు.

శ్రీశైలంలో రేషన్ బియ్యం పట్టివేత

శ్రీశైలం, అక్టోబరు 10: శ్రీశైలం దేవస్థానం పరిధిలో సేకరించిన రేషన్ బియ్యాన్ని బయటి ప్రాంతాలకు తరలిస్తూ శ్రీశైలం పోలీసులకు పట్టుపడ్డారు. సీఐ ప్రసాదరావు తెలిపిన వివరాలివీ.. సిబ్బంది రఘునాథుడు, లాలూ నాయక్, మహేష్, శివ మహేంద్రరెడ్డి, నాగవేణి ఒక ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఎనిమిది 50 కిలోల బ్యాగులలో ఉన్న 400 కేజీల రేషన్ బియ్యాన్ని వీరయ్య, గొల్ల పాపారావు, మూడావత్ మల్లేశ్ ఈ బియ్యాన్ని తెలంగాణ రాష్ట్రంలోని మన్ననూరుకు తరలిస్తుండగా ముగ్గురుని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు సీఐ ప్రసాదరావు వెల్లడించారు.

అన్న క్యాంటీన్ నిర్మాణం పూర్తి



నందికొట్కూరులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న క్యాంటీన్

నందికొట్కూరు, అక్టోబరు 10: పట్టణంలోని సంత మార్కెట్ సమీపంలో నాడు టీడీపీ ప్రభుత్వంలో అన్నా క్యాంటిన్ నిర్మాణం కోసం భవనాన్ని నిర్మించారు. అయితే అది ప్రారంభ దశలో ఉన్న సమయంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వార్డు సచివాలయంగా ఆ భవనాన్ని వినియోగించారు. ప్రస్తుతం తిరిగి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి పురుడు పోసుకుంటున్నాయి. అందులో భాగంగా నందికొట్కూరు పట్టణంలోని భవన పునఃనిర్మాణ పనుల కోసం రూ.23 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. దీంతో అన్నా క్యాంటిన్ సర్వాంగ సుందరంగా తయారైంది. ఈనెల 14వ తేదీన నందికొట్కూరు పట్టణంలోని అన్నా క్యాంటిన్‌ను ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ బేబి తెలిపారు.

నాయకుల సిండికేట్

● మద్యం షాపుల టెండర్ ప్రచారానికి ఎక్సైజ్ అధికారుల పాట్లు
● నేటితో గడువు ముగింపు

నందికొట్కూరు, అక్టోబరు 10: నందికొట్కూరు ఎక్సైజ్‌శాఖ పరిధిలోని 4 మండలాలకు 10 మద్యం దుకాణాలను కేటాయించారు. నందికొట్కూరు పట్టణంలో 4, రూరల్‌లో 2, మిడ్తూరులో 2, జూపాడుబంగ్లా 1, పగిడ్యాలలో 1 దుఖాణానికి టెండర్లు ఆహ్వానించారు. 10 దుఖాణాలకు 136 టెండర్లు దాఖలయ్యాయి. ఒక్కొక్క దుకాణానికి సగటున 25 టెండర్లు అయిన దాఖలవుతాయని ఆశించారు. అయితే మొదటి నుంచి వ్యాపారులు అంతంత మాత్రంగా ముందుకు వస్తున్నారు. సర్కిల్ పరిధిలోని ఒక జూపాడుబంగ్లా మండలం మినహా మిగిలిన చోట్ల అధికారులు ఆశించిన మేర టెండర్లు రాలేదు. దీంతో మరో రెండు రోజులు టెండర్లు గడువు పెంచారు. అయినా కూడా చెప్పుకోదగిన విధంగా టెండర్లు రావడం లేదు. దీనికి కారణం నాయకులు, వ్యాపారులు సిండికేట్ అయ్యారన్న చర్చ జరుగుతోంది. జూపాడుబంగ్లా దుఖాణానికి 47 టెండర్లు అత్యధికంగా దాఖలు కాగా, అత్యల్పంగా నందికొట్కూరు రూరల్ దుఖాణానికి 4 టెండర్లు మాత్రమే వచ్చాయి. ఇక ఒక్క రోజు మాత్రమే గడువు ఉంది. దీని కోసం ఎక్సైజ్‌శాఖ అధికారులు ఆశావాహులు, నాయకులతో సమావేశాలు నిర్వహించి, అవగాహన పెంచుతున్నారు. మండల కేంద్రాల్లో ఫ్లెక్సీల ఏర్పాటు, డిస్‌ప్లే బోర్డులను ఎక్సైజ్‌శాఖ అధికారులు ఏర్పాటు చేశారు.

ప్రైవేట్ మద్యం టెండర్ల పట్ల వ్యాపారులను ఆకర్షించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారుల పలు రకాల పాట్లు పడుతున్నారు. 9వ తేదీతో ఆఖరు గడువు అని చెప్పి టెండరుదారుల నుంచి స్పందన అంతంత మాత్రంగా ఉండడంతో 11వ తేదీ వరకు గడువు పెంచారు. అయినా కూడా టెండరుదారులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. దీంతో అధికారులు ఆశావాహులు టెండర్లు వేయాలంటూ పట్టణంల పల్లెల్లోనూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

లైసెన్స్‌దారులకు 20శాతం మార్జిన్

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ నూతన మద్యం పాలసీ 2024-26లో 20 శాతం మార్జిన్ ఇవ్వడం వల్ల ఒక మద్యం దుకాణంలో రూ.10 కోట్ల వ్యాపారం జరిగినట్లయితే దుకాణ లైసెన్సీ దారుడికి రెండు కోట్ల రూపాయలు మార్జిన్ రూపంలో వస్తుందని, కాబట్టి ఈ అవకాశాన్ని ఆశావాహులు ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సీఐ రామాంజనేయులు సూచించారు.

మహాగౌరిగా భ్రమరాంబ

- నంది వాహనంపై దర్శనమిచ్చిన ఆది దంపతులు
- ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు







నృత్యం చేస్తున్న కళాకారులు







కళాకారుల ప్రదర్శన

శ్రీశైలం, అక్టోబరు 10: శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారు నవదుర్గ అలంకరణలలో ఒకటైన మహాగౌరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం వాహనసేవలో భాగంగా నందివాహనంపై మల్లికార్జునస్వామి, భ్రమరాంబికాదేవిలు దర్శనమిచ్చారు. అయితే వర్షం రావడంతో గ్రామోత్సవాన్ని రద్దు చేశారు. కళాకారుల ప్రదర్శనలు, సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాలను ఆలయ ఈఓ డి.పెద్దిరాజు పర్యవేక్షించారు.

నేడు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు

శుక్రవారం భ్రమరాంబికా అమ్మవారు సిద్ధిదాయిని అలంకారంలో దర్శనమిస్తారు. స్వామి, అమ్మవార్లకు అశ్వవాహనసేవ నిర్వహించనున్నారు. అదేవిధంగా దసరా మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

అమ్మవారి తపస్సుకు ప్రసన్నుడైన పరమశివుడు

నవదుర్గల్లో మహాగౌరి రూపం తెల్లని వస్త్రాలతో అత్యంత శాంతమూర్తిగా ఉంటుంది. చతుర్భుజాల తో, కుడివైపు పై భుజంలో త్రిశూలాన్ని, కింది భుజంలో అభయహస్తాన్ని, ఎడమవైపు పై భుజంలో వరముద్రను, కింది భుజంలో ఢమరుకాన్ని ధరించి భక్తులను కటాక్షిస్తుంది. మహాగౌరి తన పార్వతి రూపంలో పరమ శివుడిని భర్తగా పొందేందుకు కఠోర తపస్సు చేయడం వల్ల ఆమె శరీరమంతా నల్లబడుతుంది. ఆ తపస్సుకు పరమశివుడు ప్రసన్నుడ వుతారు. అప్పుడు ఆ దేవి తేజోవంతమైన గౌరవర్ణంతో కనిపిస్తారు. అందుకే ఈ దేవిని మహాగౌరిగా పిలుస్తారు. దసరా మహోత్సవాల్లో 8వ రోజున ఈ దేవిని పూజిస్తారు. అలా పూజించడం వల్ల సకల పాపాలు నశిస్తాయని, కష్టాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.



నంది వాహనంపై స్వామి అమ్మవార్లు

ఆర్‌యూలో ఎంబీఏ, ఎంసీఏ స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు(అర్బన్), అక్టోబరు 10: రాయలసీమ యూనివర్సిటీలో ఈ నెల 14, 15 తేదీల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్స్ ప్రొఫెసర్ ఎన్ నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. కన్వీనరు కోటాలో మిగిలిన సీట్లకు నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు విద్యార్థులు దరఖాస్తుతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ ట్యూషన్ ఫీజులతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్ సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

టెట్‌కు 263 మంది అభ్యర్థుల గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్), అక్టోబరు 10: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు గురువారం 263 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని డీఈవో శామ్యూల్ తెలిపారు. గురువారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన రెండు సెషన్లకు 2,528 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఇందులో 2,265 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 263 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 1,156 మందికి గాను, 1,515 మంది హాజరు కాగా, 120 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన టెట్ పరీక్షకు 1372 మందికి గాను 1229 మంది అభ్యర్థులు హాజరు కాగా, 143 మంది గైర్హాజరయ్యారు. ఇన్‌చార్జి డీఈవో ఏడీ-2 శ్రీనివాసులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కొత్తపల్లి, అక్టోబరు 10: కొత్తపల్లి మండలం కొత్తమాడుగుల గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ నుండి కింద పడి బొజ్జ రాజేశ్వరి (45) మృతి చెందింది. పాములపాడు గ్రామానికి చెందిన బొజ్జ సాయిబాబా బొజ్జ రాజేశ్వరి దంపతులు టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనంపై కొత్తపల్లి మండలంలోని బట్వారిపల్లి సరిహద్దులో ఉన్న తమ పొలానికి వెళ్తున్నారు. మార్గమధ్యంలో కొత్తమాడుగుల సమీపంలో మామిడితోట వద్ద బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో వెనుకాల కూర్చున్న రాజేశ్వరి తలకు బలమైన రక్తగాయాలు కావడంతో ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలి కుమారుడు బొజ్జ వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి ఎస్ఐ కేశవ తెలిపారు.

బాలికపై అత్యాచారం!

- ఆలస్యంగా వెలుగులోకి.. ● పోక్సో కేసు నమోదు

వెలుగోడు, అక్టోబరు 10: వెలుగోడు మండలంలోని ఓ గ్రామంలో ఐదో తరగతి చదువుతున్న ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన పదో తరగతి చదువుతున్న ఓ బాలుడు అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం ఎస్ఐ విష్ణు నారాయణ తెలిపిన వివరాల మేరకు ఈ నెల 1న ఈ ఘటన జరిగిందని తెలిపారు. కొన్ని రోజుల తర్వాత బాలిక అనారోగ్యంతో బాధ పడుతుండటంతో తల్లిదండ్రులు వైద్యశాలకు తరలించడంతో ఈ ఘటన బయట పడిందన్నారు. తల్లి తండ్రులు గట్టిగా ప్రశ్నించడంతో బాలిక జరిగిన విషయం చెప్పిందని అన్నారు. ఈ మేరకు ఈ నెల 8వ తేది బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ మేరకు బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. గురువారం బాలుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

నిందితులకు రిమాండ్

దేవనకొండ, అక్టోబరు 10: గాలిమరల కార్యాలయంపై దాడి కేసులోని నిందితులకు ఈ నెల 23 వరకు రిమాండ్‌ను న్యాయాధికారి ఆదేశించారు. ఈ నెల 3న మండలంలోని మాదాపురం వద్ద గ్రీన్ ఇన్‌ఫ్రా పవన విద్యుత్ కార్యాలయంపై ఆలూరు ఎమ్మెల్యే సోదరుడు వెంకటేష్, దేవనకొండ జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ (కిట్టు)లతోపాటు మరో 22 మంది దాడి చేశారు. దేవనకొండ పోలీసు స్టేషన్లో 333,324(4),(5),308(2) భారతీయ న్యాయ సంహిత చట్టం (బీఎన్ఎస్) కింద కేసు నమోదైంది. ఆలూరు, ఆస్పరి గాలిమరల కార్యాలయాలపై దాడి చేయడంతో రెండు చోట్ల కేసులు నమోదయ్యాయి. దేవనకొండ సీఐ వంశీనాథ్ పీటీ వారెంట్‌పై నిందితులను బుధవారం పత్తికొండ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి వారిని రిమాండ్‌కి ఆదేశించారు.

ప్రాణం తీసిన రీల్స్

బైక్ పై నుంచి పడి యువకుడి మృతి



ఆంజనేయ (ఫైల్)

కోసిగి, అక్టోబరు 10: రీల్స్ పిచ్చి ఓ యువకుడి ప్రాణం తీసింది. ఈ ఘటన గురువారం కోసిగిలో చోటు చేసుకుంది. కోసిగిలోని రైల్వే గేటు సమీపంలోని సిద్ధారుడ శాంతాశ్రమం సమీపంలో నివాసం ఉంటున్నారు. చిన్నన్నపల్లి తిమ్మయ్య, లక్ష్మి దంపతుల మూడో కుమారుడు చిన్నన్నపల్లి అంజనేయ (18) అనే యువకుడు డ్రైవింగ్ చేస్తూ రీల్స్ తీసుకునే అలవాటు పెట్టుకున్నాడు. ఇందులో భాగంగానే గురువారం సాయంత్రం ఉరుకుంద రోడ్డు వైపు వెళ్తూ సెల్ఫీ తీసుకుంటున్నాడు. ఆ సమయంలో కళ్లకు కర్చీప్ అడ్డం పడటంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని గుర్తించలేక పోయాడు. సాయిబాబా గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న కూలీల ఆటోను తప్పించబోయి అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో అంజనేయ తలకు బలమైన గాయాలయ్యాయి. అదే ఆటోలో అంజనేయ తల్లి లక్ష్మి, చెల్లెలు కొరవంజిమ్మ ఉన్నారు. అంజనేయను 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లి, చెల్లెలు గుండెలవిసెలా రోదించారు. గత వారం రోజుల క్రితం కూడా బైక్ ప్రమాదంలో అంజనేయ ముఖానికి తీవ్ర గాయాలైనట్టు తెలుస్తోంది. ఆదోని ఏరియాసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు ఆంజనేయ

బన్నీ ఏర్పాట్ల పరిశీలన

ఆదోని/హొళగుంద, అక్టోబరు 10 : హొళగుంద మండలం పరిధిలోని దేవరగట్టులో దసరా పండుగ సందర్భంగా ఈ నెల 12వ తేదీన జరిగే మాళ మల్లేశ్వర స్వామి బన్నీ ఉత్సవాలపై ఏర్పాట్లపై ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బన్నీ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. వాహనాల పార్కింగ్, సీసీ ఫుటేజ్, బారికేడ్లు, శానిటేషన్, మరియు లైటింగ్ ఏర్పాటు చేయవలసిన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అరికెర గ్రామంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ డీఎస్పీ వెంకట రామయ్య కలిసి గ్రామ ప్రజలకు ప్రశాంత వాతావరణంలో పండుగా జరుపుకునే విధంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్ రాజు, ఆదోని డీఎల్‌పీవో నూర్ జహాన్, ఆలూరు సీఐ శ్రీనివాస్ నాయక్, ఎస్సై బాలనరసింహులు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

మిర్చి రైతును దగా చేసిన గోడౌన్ యజమాని, బ్యాంకర్లు

సంజామల, అక్టోబరు 10: మండలంలోని పేరుసోమల గ్రామానికి చెందిన మిర్చి రైతు సూర్య నారాయణ రెడ్డి తనను గోడౌన్ యజమాని, బ్యాంక్ అధికారి మోసం చేశారని ఆవేదన చెందాడు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో ఈ విషయం బట్టబయలు చేశాడు. ఆయన మాట్లాడుతూ గతేదాడి మే నెలలో సౌదరదిన్నె గ్రామంలో ఈదుల శివారెడ్డి గోడౌన్‌లో 185 బస్తాల మిరపకాయలను భద్రపరిచానన్నారు. మిరపకాయలకు మాయలూరు కరూర్ వైశ్య బ్యాంకులో రూ.5 లక్షలు లోనుగా తీసుకున్నానన్నారు. అనంతరం 57బస్తాలు మిరపకాయలను విక్రయించి బ్యాంకు లోను కట్టేశాడు. అయితే ఇటీవల బ్యాంకు మేనేజర్, సిబ్బంది తన ఇంటి దగ్గరికి వచ్చి 6 పేపర్లపై సంతకాలు తీసుకొని పోయారన్నారు. అనంతరం మిగిలిన బస్తాలను విక్రయించుకునేందుకు గోడౌన్ దగ్గరకు వెళ్లగా గోడౌన్ యజమాని నీ మిరపకాయలు ఎక్కడ ఉన్నాయి అప్పుడే అమ్మేశావని తనపై దాడి చేశాడన్నారు. బ్యాంకు అధికారులు తన మిరపకాయలు వేలం వేశారని గోడౌన్ యజమాని బుకాయించాడని ఆయన చెప్పారు. కోవెలకుంట్ల పోలీసు స్టేషన్‌లో గోడౌన్ యజమాని, బ్యాంకు మేనేజర్‌పై ఆయన కేసు నమోదు చేశారు.

గుట్టుగా నాటు సారా తయారీ

దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో నిల్వ

ఆలూరు, అక్టోబరు 10 : దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో జోరుగా నాటుసారా తయారు చేస్తున్నారు. దసరా రోజున జరిగే దేవరగట్టు ఉత్సవాలకు భారీఎత్తున జనం రానుండటంతో ముందస్తుగా నాటుసారాను తయారు చేసి రహస్య ప్రాంతాల్లో భద్రపరచచినట్లు సమాచారం. అయితే పోలీసు, ఎక్సైజ్ అధికారులు సారా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నా ఉత్సవం రోజున బహిరంగంగా సారా విక్రయాలు సాగుతుండటం షరా మామూలుగా మారింది. నేరణికి, కొత్తపేట, అరికేర, నేరణికి తండా కొండల్లో అధికంగా ఈ నాటుసారా స్థావరాలు ఉన్నాయి. ఇప్పటికే పోలీసు, ఎక్సైజ్ శాఖల సిబ్బంది సారా స్థావరాలపై దాడులు నిర్వహించి బెల్లం ఊటలను, సారా బట్టీలను ధ్వంసం చేస్తున్నారు. ఈ ఉత్సవాల్లో నాటుసారా నియంత్రణకు అధికారుల చర్యలు ఏ మేర ఫలిస్తాయో చూడాలి.

ఏపీఎస్పీ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా నాగేంద్రరావు

కర్నూలు, అక్టోబరు 10: ఏపీఎస్పీ రెండో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా నాగేంద్రరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం గ్రేహౌండ్స్ కమాండెంట్‌గా ఉంటున్నారు. ఇక్కడ ఉన్న అసిస్టెంట్ కమాండెంట్ కేశవరెడ్డికి అడిషినల్ కమాండెంట్‌గా పదోన్నతి కల్పించి ఫోర్త్ బెటాలియన్‌కు బదిలీ చేసింది. కర్నూలు ఏఆర్‌లో ఉన్న అడిషినల్ ఎస్పీ నాగబాబుకు కమాండెంట్‌గా పదోన్నతి కల్పించి ఇంటలిజెన్స్ విభాగానికి బదిలీ చేసింది. హోంగార్డు డీఎస్పీ కృష్ణమోహన్‌కు పదోన్నతి కల్పించి కర్నూలు ఏఆర్ అడిషనల్ ఎస్పీగా నియమించింది.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ఆదోని రూరల్, అక్టోబరు 10 : రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఆంజనేయ(49)ను ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఆయన మృతి చెందాడు. ఆస్పరికి చెందిన మూలింటి అంజనేయ కొంత కాలంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆదోనిలో నివాసం ఉంటున్నారు. ఆయన సాదాపురం సమీపంలో ఉన్న పెట్రోలు బంకులో పని చేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పెట్రోలు బంకు నుంచి సమీపంలో ఉన్న టీ కొట్టుకు వెళ్లి టీ తాగాడు. తిరిగి వెళ్లే క్రమంలో ఆస్పరి నుంచి ఆదోని వైపు వస్తున్న గుర్తు తెలియని బైక్ ఢీకొంది. దీంతో అంజనేయకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మృతునికి భార్య లలితతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రతన్ టాటా మృతి దేశానికే తీరని లోటు

డోన్, అక్టోబరు 10: రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు అని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కొత్తబస్టాండు రహదారిలో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ విదేశాల్లో లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి రతన్ టాటా గర్వకారణంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి విజయభట్టు, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రతన్ టాటా మృతి విచారకరం: దేశానికి ఉన్నత సేవలందించిన ప్రపంచ పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతి విచారకరమని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం రతన్ టాటా మృతికి ఆయన సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ దేశ ప్రతిష్టను ప్రపంచ వ్యాపార సామ్రాజ్యంలో ఇనుమడింపజేసిన ఘనత రతన్ టాటాకే దక్కిందన్నారు.

అవుకు: రతన్ టాటా మృతి తీరని లోటని టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరరెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ రతన్‌టాటా దేశ అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి, టీడీపీ మండల నాయకులు మొట్ల రామిరెడ్డి, ఎస్ రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

డోన్(రూరల్): రతన్ టాటాకు భారత్ రత్న ఇవ్వాలని డోన్ ఏపీ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎన్ భానుసింగ్ కోరారు. గురువారం రతన్ టాటా మృతికి ఆయన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

భ్రమరాంబ దేవికి బంగారు కమ్మలు

కొలిమిగుండ్ల, అక్టోబరు 10: మండలంలోని నేల బిలం మల్లేశ్వర స్వామి ఆలయంలో వెలసిన భ్రమరాంబదేవికి ఆలయ చైర్మన్ బాలవెంకటరెడ్డి దంపతులు బంగారు కమ్మలు వితరణ చేశారు. గురువారం మల్లేశ్వర స్వామి, భ్రమరాంబ దేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, బంగారు కమ్మలు అందించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే


మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 10: ఆళ్లగడ్డలో తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో చైర్మన్ రామలింగారెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం చంద్రబాబు చొరవతో 0.6 టీఎంసీలుగా ఉన్న గండ్లేరు రిజర్వాయర్ సామర్థ్యాన్ని 0.9 టీఎంసీలకు పెంచేందుకు రూ.40 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఆళ్లగడ్డలో మున్సిపల్ హాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మున్సిపాలిటీల్లో వీధి దీపాల నిర్వహణకు గత ప్రభుత్వంలో రూ.400 కోట్ల బకాయిలు ఉండడంతో ప్రస్తుతం తలెత్తుతున్న సమస్యను పరిష్కరించాలని మంత్రి నారాయణతో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అర్హులందరికీ టిడ్కో ఇళ్లు, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి, వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'కక్ష సాధింపు చర్యలకు టీడీపీ దూరం': కక్షసాధింపు చర్యలకు టీడీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు దూరంగా ఉంటారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో పోలీసులు, వైసీపీ నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో నంద్యాల జిల్లాలో శిల్పా వెంచర్‌లో ఓ మైనర్ బాలికపై అఘాయిత్యం చేసి హత్య చేసినప్పుడు పోలీసులు, వైసీపీ నాయకులు ఎక్కడున్నారని ఆమె ధ్వజమెత్తారు.

దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజు గురువారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



డోన్, ప్యాపిలిలో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు


నందవరంలో మహాగౌరిగా..


బనగానపల్లెలో మహిషాసురమర్ధినిగా


మద్దిలేటి స్వామి క్షేత్రంలో..


కోవెలకుంట్లలో..

మద్యం దుకాణాలకు 258 దరఖాస్తులు


బనగానపల్లెలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంటెంట్

డోన్, అక్టోబరు 10: డోన్ నియోజకవర్గంలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. గురువారం నాటికి నియోజకవర్గంలోని 16 మద్యం దుకాణాలకు 258 దరఖాస్తులు వచ్చాయి. డోన్ మున్సిపాలిటీలోని నాలుగు మద్యం దుకాణాలకు 121 దరఖాస్తులు వచ్చాయి. డోన్ రూరల్‌లో 2 మద్యం దుకాణాలకు 29 దరఖాస్తులు వచ్చాయి. బేతంచెర్ల మున్సిపాలిటీలో నాలుగు మద్యం దుకాణాలకు 41 దరఖాస్తులు రాగా, రూరల్‌లో 3 మద్యం దుకాణాలకు 30 దరఖాస్తులు వచ్చాయి. ప్యాపిలి మండలంలో 3 మద్యం దుకాణాలకు 37 దరఖాస్తులు వచ్చినట్లు డోన్ ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు.

బనగానపల్లె: బనగానపల్లె ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లో ఉన్న 12 మద్యం దుకాణాలకు 119 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంటెంట్ రాముడు గురువారం విలేఖర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనగానపల్లె మండలంలో 7 మద్యం దుకాణాలకు 78 దరఖాస్తులు, అవుకు మండలంలో 2 మద్యం దుకాణాలకు 26 దరఖాస్తులు, కొలిమిగుండ్ల మండలంలో 3 మద్యం దుకాణాలకు 15 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కొలిమిగుండ్ల మండలానికి అతితక్కువగా దరఖాస్తులు వచ్చాయని, ఈనెల 11వతేదీ వరకు గడువు ఉందని, ఎవరైనా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 14వతేదీన కలెక్టర్ కార్యాలయంలో డిప్ పద్ధతి ద్వారా మద్యం దుకాణాలు కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి, ఎస్ఐ కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని నంద్యాల ఎక్సైజ్ అసిస్టెంటు సూపరింటెండెంట్ రాముడు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు మద్యం షాపులకు దరఖాస్తులు చివరి రోజు శుక్రవారం సాయంత్రం స్వీకరిస్తారని తెలిపారు. సీఐ టక్కీబాషా, ఎస్ఐలు సందీప్‌యాదవ్, ప్రవీణ్‌కుమార్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ విజేత వైజాగ్ జట్టు


షీల్డ్‌లు అందజేస్తున్న దాతలు

చాగలమర్రి, అక్టోబరు 10: చాగలమర్రి గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన 53వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌గా వైజాగ్ జట్టు నిలిచింది. గురువారం జరిగిన పోటీలలో వైజాగ్, పశ్చిమ గోదావరి జిల్లా జట్లు పోటీ పడగా వైజాక్ జట్టు గెలుపొందింది. ఈ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన వైజాగ్ జట్టుకు, రెండో స్థానంలో నిలిచిన పశ్చిమ గోదావరి, మూడో స్థానంలో ఉమ్మడి విజేతగా కర్నూలు, సత్యసాయి జిల్లా జట్లకు దాతలు చక్రం షబ్బీర్, ఇంతియాజ్, కిజర్, హెచ్‌ఎం కోటయ్యలు షీల్డ్‌లు, ప్రశంసా పత్రాలను అందజేశారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి మహబూబ్‌బాషా, సంయుక్త కార్యదర్శి కడ్డిబాషా, పీడీలు దాదాపీర్, షేక్షావలి, 18 జిల్లాల మేనేజర్లు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పల్లె పండుగ సభలను విజయవంతం చేయండి

కొలిమిగుండ్ల, అక్టోబరు 10: మండలంలోని గ్రామాల్లో ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించే పల్లె పండుగ గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డి కోరారు. గురువారం గ్రామసభలపై సమీక్షించారు.

బనగానపల్లె: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బనగానపల్లె పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలోని హాల్‌లో పల్లెపండుగ కార్యక్రమంపై ఎంపీడీవో రమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బనగానపల్లె మండలానికి రూ. 7.40 కోట్ల విలువగల సీసీ రోడ్ల పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణ, పంచాయతీరాజ్ ఏఈ రమణ పాల్గొన్నారు.

రుద్రవరం ఫారెస్టు సెక్షన్ ఆఫీసరుగా ఖాశీం నాయక్

రుద్రవరం, అక్టోబరు 10: రుద్రవరం ఫారెస్టు సెక్షన్ ఆఫీసరుగా ఖాశీంనాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించినట్లు రేంజర్ శ్రీపతినాయుడు తెలిపారు. రుద్రవరం సెక్షన్ ఆఫీసరుగా పనిచేస్తున్న నాగరాజు బండి ఆత్మకూరు రేంజ్ జీసీ పాలెం సెక్షన్ ఆఫీసరుగా బదిలీ అయినట్లు రేంజర్ తెలిపారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 10: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్ ఆధ్వర్యంలో ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు గురువారం పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో పాటు అమృతవల్లి అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నూతన వ్యవసాయ పద్ధతులు పాటించాలి

డోన్(రూరల్), అక్టోబరు 10: నూతన వ్యవసాయ విధానాలను పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ధనలక్ష్మి, మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌షఫీ అన్నారు. మండలంలోని కొత్తకోట గ్రామంలో వేరుశనగలో విశిష్ట రకం దిగుబడులపై క్షేత్ర దినోత్సవ (ఫీల్డ్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని 125 ఎకరాల్లో పంట దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

'చివరి ఆయకట్టుకు సాగు నీరు'

చాగలమర్రి, అక్టోబరు 10: కేసీ ప్రధాన కాలువ నుంచి చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నామని కేసీ కెనాల్ డీఈ పుల్లయ్య తెలిపారు. గురువారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో సాగునీటి సంఘం ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేసీకెనాల్ పరిధిలో సాగునీటి ఎన్నికలను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు

బేతంచెర్ల, అక్టోబరు 10: మండలంలోని గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. గురువారం బేతంచెర్ల ఎస్ఐగా రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న అశోక్ పదోన్నతిపై బదిలీ కావడంతో ఆయన స్థానంలో కర్నూలు వన్‌టౌన్ ఎస్ఐగా పని చేస్తున్న రమేష్‌బాబు బేతంచెర్ల ఎస్ఐగా నియమించారు.

ఆకట్టుకున్న పులి వేషధారణ

చాగలమర్రి, అక్టోబరు 10: చాగలమర్రిలో దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం ఆర్యవైశ్య యువకులు, పిల్లలు వేసిన పులి వేషధారణ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అయ్యప్ప ఆలయం నుంచి వీధుల గుండా పులి వేషాలతో విన్యాసం చేస్తూ ఊరేగింపుగా తరలివెళ్లారు. ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, ఆర్య వైశ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పులి వేషధారణలో చిన్నారులు